క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు: తిమ్మన్నగూడెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంజూరు చేసిన రూ.20 లక్షలతో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అధ్యక్షతన, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబీ), నాయకులు యలమర్తి సత్తిబాబు, సునీల్, సురేష్ తదితరులున్నారు.

నేడు తోకలపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

నిడమర్రు: తోకలపల్లిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు మండల స్థాయిలోని ముఖ్య నాయకులు పాల్గొనాలని సత్యకుమార్ కోరారు.

నేడు కాకర్లమూడిలో పల్లెకు పోదాం

ఉంగుటూరు: పల్లెకు పోదాం కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానలు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని మంగరావు కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెదపాడు: కోడిపందేల స్థావరంపై ఎస్ఈబీ అధికారులు దాడిచేసి పందేలు ఆడుతున్న వ్యక్తుల నుంచి రూ.21,680 నగదు, 8 కోళ్లు, 46 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు పోలీసులు సోమవారం తెలిపారు. మండలంలోని కొనికి గ్రామ శివారున కోడిపందేలు ఆడుతన్నారని సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఎస్ఈబీ అధికారులు తెలిపారు. నిందితులను పెదపాడు పోలీసులకు అప్పగించారు. పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపినాథపట్నంలో నేడు ప్రత్యేక పూజలు

ఉంగుటూరు : గోపినాథపట్నం భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించే కార్యక్రమాలను అర్చకులు వెల్లడించారు. రాష్ట్ర దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఆటోలపై ఈ-చలానాలు రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటోలపై ఇష్టానుసారంగా విధిస్తున్న ఈ-చలానాలను రద్దు చేయాలంటూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణికి, ట్రాఫిక్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్‌లకు యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఆటోలపై వేలాదిరూపాయలు ఫైన్లు విధించారని పేర్కొన్నారు. ప్రధాన సిగ్నల్ పాయింట్లు పాత బస్టాండ్, ఫైర్ స్టేషన్ ప్రాంతాల్లో అమర్చిన సీసీ కెమెరాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, వాటిని సరైన దిశలో అమర్చకుండా వాహనాలపై ఫైన్లు విధించడం సరికాదని తెలిపారు. స్టాప్ లైన్ వైలేషన్ ఫైన్లకు ఎటువంటి ఫొటో ప్రూఫ్‌లు ఉండటం లేదని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ పరిశీలన చేయించి ఆటోలపై ఉన్న చలానాల రద్దుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, సీఐటీయూ నాయకులు పి.కిషోర్ పాల్గొన్నారు.

శ్రీవారికి సహస్ర దీప సేవ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీవారికి సహస్రదీప సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేసి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి సాయంకాల పూజలు చేసి, గరుడవాహనంపై ప్రాకార ప్రదక్షిణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదల గుండె చప్పుడు సీఎం జగన్


కోమర్రులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కోమర్రులో గడపగడపకు మన ప్రభుత్వం

గణపవరం: నాలుగేళ్లుగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటి తలుపు తట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల గుండె చప్పుడుగా మారారని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోట్ల మంది ప్రజలు అండగా నిలిచారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం కోమర్రు గ్రామ సచివాలయం పరిధిలో 217వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకూ ఏప్రభుత్వమూ అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజల అండ ఉన్నంత కాలం జగన్‌ను ఎవ్వరూ ఏమీ చేయలేరన్నారు. జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా పచ్చమీడియా, పచ్చ పార్టీ, దాని అనుబంధ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పథకాల అమలుపై ఆయన ఆరా తీశారు. పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పారదర్శకంగా నూరుశాతం పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి బాబులు, సర్పంచ్ కేశవరపు శైలజ, ఎంపీటీసీ సభ్యురాలు వడ్డి సీతామహాలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, గ్రామ పార్టీ సొసైటీ అధ్యక్షుడు వడ్డిగంగరాజు, ఉపసర్పంచ్ కసాని బాబులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటినాదం మల్లేశ్వరరావు, డి.కుముదవల్లి సర్పంచ్ తూము వీరవేణి, సొసైటీ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, పార్టీ నాయకులు విప్పర్తిశ్రీను, కర్రిసూర్రెడ్డి, వడ్డి ఉమ పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచే ప్రభుత్వం

గణపవరం: వైద్యపరంగా ఎంత సహాయమైనా చేయడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.3.80లక్షల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మిడి గ్రామానికి చెందిన మేడవరపు లక్ష్మీకాంతానికి రూ.లక్ష, బావాయిపాలెం గ్రామానికి చెందిన బొబ్బిలిగంగా భవానికి రూ.1.20 లక్షలు, గణపవరానికి చెందిన గంటా విజయకుమారికి రూ. 80వేలు, ఎ.గోపవరానికి చెందిన నెర్సు రాంబాబుకు రూ.80 వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, నిడమర్రు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గణపవరం సొసైటీ చైర్మన్ కొనిశెట్టి రమేష్, సువర్ణేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కూసంపూడి రామకృష్ణ, బువ్వనపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను పాల్గొన్నారు.

నేడు పోలసానిపల్లిలో వైఎస్సార్ సీపీ శ్రేణుల పర్యటన

భీమడోలు: పోలసానిపల్లి సచివాలయం పరిధిలో ఈనెల 28వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు. నాలుగున్నర ఏళ్లలో పోలసానిపల్లి పంచాయతీ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ లబ్ధి, అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం


కమ్యూనిటీ హాలు శ్లాబ్‌కు పూజ నిర్వహిస్తున్న జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు

దెందులూరు: అలుగులగూడెంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మంజూరు చేసిన రూ. 10 లక్షలు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మంజూరు చేసిన రూ.5 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు శ్లాబ్‌కు సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు పూజలు నిర్వహించారు. వార్డు మెంబరు ప్రసన్న రాణి, రవి, నాయకులు ఆనంద్, రవి, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి


ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన నారాయణపురం వైఎస్సార్ సీపీ నాయకులు మంగరావు, నాయకులు

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నారాయణపురం ఉపసర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై న మరడ సాంబశివరావు సోమవారం ఎమ్మెల్యే వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.ఆయనతోపాటు గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ మరడ మంగరావు, ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి అడపా శ్రీనివాసరావు, నాయకులు బళ్ల త్రిమూర్తులు, పొత్తూరి శ్రీనివాజరాజు, నారాయణపురం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, ఆర్‌బీకే చైర్మన్లు మతుకు మల్లి శ్రీధర్, బొబ్బొలి శ్రీను, వార్డు సభ్యుడు నేదూరి గంగాధర్, వినోద్, రావేటి వీరాచారి, పైడి వరప్రసాదరావు సచివాలయ కన్వీనర్ సీపాని బాలు, వర్షాల నతనియేలు, ఎంపీటీసీ అరవెల్లి మహాలక్ష్మి దానయ్య ఉన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి


తిమ్మన్నగూడెంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

దెందులూరు: అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానం, ఆచరణ తీరును గమనించారని, రాష్ట్రాభివృద్ధికి మళ్లీ ఏపీకి సీఎంగా జగనన్నే కావాలని వారు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం చల్లచింతలపూడి పంచాయతీ తిమ్మన్నగూడెంలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబీ), వైఎస్సార్ సీపీ నాయకులు యలమర్తి సత్తిబాబు, సునీల్, సురేష్ వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి మాతకు హారతి


మందలపర్రు పంచాయతన క్షేత్రంలో గోదావరి మాతకు నవహారతులు ఇస్తున్న కాశీ నుంచి వచ్చిన సిద్ధులు


లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం మందలపర్రు ఉమా నీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో కాశీ క్షేత్రం నుంచి వచ్చిన సిద్ధులతో గోదావరి మాతకు వైభవంగా నవ హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహా శివునికి లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి అశేష భక్తులు హాజరయ్యారు. ముందుగా నీలకంఠేశ్వర స్వామికి నడింపల్లి సత్యనారాయణరాజు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ నిర్వహించిన అన్న సమారాధనలో 10 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపవాస దీక్ష పూర్తి చేసిన వారికి ప్రత్యేక అన్న సమారాధన నిర్వహించారు.

దళితుల సాగుభూమి సమస్య పరిష్కారంపై హర్షం


పండుల రవీంద్ర, ఎమ్మెల్సీ

దెందులూరు: కొవ్వలి గ్రామంలో దశాబ్దాల కాలంగా దళితులు ఎదుర్కొంటున్న సాగు భూముల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత హామీ ఇవ్వడంపై గ్రామస్తులతోపాటు ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కొవ్వలిలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ తరతరాలుగా దళితులు భూమిని సాగు చేసుకుంటూ పండిన పంటతో కుటుంబాలను పోషించుకుంటున్నారని, గ్రామదీప్ సంస్థ కోర్టుకు వెళ్లి అక్కడ సాగు చేసుకోవడానికి వీల్లేదంటూ అడ్డుకునే ప్రయత్నం చేయడాన్ని ఎమ్మెల్సీ తప్పుపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పేద, బడుగు, బలహీన, గిరిజన వర్గాల ప్రజలు సాగులో ఉన్న వారికి శాశ్వత భూహక్కు తాత్కాలిక ఆధీన పత్రాలను పంపిణీ చేస్తున్నారన్నారు. కొవ్వలిలో అందుకు భిన్నంగా కేవలం దళితులను, దళితుల జీవన విధానాన్ని, భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా, పరిగణించకుండా వారి సాగును అడ్డుకోవాలని అన్ని విధాలా ఆపడానికి చేసే ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన ప్రతి దళితుడి భవిష్యత్తు కోసం వారి భద్రత హక్కు కల్పించేందుకు సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, హోం మంత్రి తానేటి వనిత హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సర్పంచ్ ఇంటేటి మధులత, కాటి అర్జున, బూసి ఎఫ్రేయాం, అంబేడ్కర్ విద్యార్థి, ఉద్యోగ, యువజన సంఘ నాయకులు, దళిత పెద్దలు, యువత, ఎమ్మెల్యేకు, హోంమంత్రి ఇచ్చిన హామీపై హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: ట్రాక్టర్ బ్లేడుతో లాటు ఊకను తీసి లారీలో వేసే సమయంలో ఊకలాటు ట్రాక్టర్ పైపడి ఊపిరాడక డ్రైవర్ మృతి చెందాడు. ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడుకు చెందిన దాసరి శ్రీను (35)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్నారు. తన గ్రామం నుంచి ఏలూరు సమీపంలోని వట్లూరు – భోగాపురం రోడ్డులో ఉన్న ఒక రైస్ మిల్లు వద్ద సోమవారం ట్రాక్టర్ బ్లేడుతో శ్రీను ఊకను తీసి లారీలో వేసే సమయంలో ఊకలాటు అకస్మాత్తుగా ట్రాక్టర్‌పై పడింది. ఊకలో కూరుకుపోయి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతడ్ని ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు.

శబరిమల యాత్రలో జాగ్రత్తలు పాటించాలి


అయ్యప్ప మాలధారుల ఇరుముడి పూజల అనంతరం అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : దీక్ష పూర్తి చేసి శబరిమల యాత్ర చేపట్టిన స్వాములు, భక్తులు తగు జాగ్రత్తలు చేపట్టాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. సోమవారం పెదవేగి మండలం రాట్నాలకుంటలో అయ్యప్ప మాలాధారులు 41 రోజుల దీక్ష ముగించుకుని శబరిమలకు బయలుదేరుతున్న సందర్భంగా నిర్వహించిన ఇరుముడి పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్ర సమయంలో బస్సులలో కార్లు ఇతర వాహనాల్లో ప్రయాణించే సమయంలో అనుభవం కలిగిన డ్రైవర్లను ఎంపిక చేసుకోవాలని గురుస్వాములకు అబ్బయ్యచౌదరి సూచించారు. స్వాములు నదీ స్నానాలు, సముద్ర స్నానం ఆచరించేటప్పుడు ప్రభుత్వం వారు అనుమతించిన ప్రదేశాలకు మాత్రమే వెళ్లాలని సూచించారు. యాత్రలో అన్ని రక్షణ చర్యలు చేపట్టి దీక్ష పరిపూర్ణం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలియజేశారు.

ముగిసిన అన్నసమారాధన

అయ్యప్ప, భవానీ మాలాధారులకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం 43 రోజులపాటు దిగ్విజయంగా నిర్వహించినట్లు గురుస్వామి చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సౌజన్యంతో పెదవేగి మండలం రాట్నాలకుంట కొఠారు అబ్బయ్య మెమోరియల్ శ్రీ షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి, భవానీ భక్తులకు 43 రోజులపాటు అన్నదానం నిర్వహించి, ఆఖరిరోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా మాలధారులతోపాటు పరిసర ప్రాంత ప్రజలకు అన్నసమారాధన నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల ఆధ్వర్యంలో ఇరుముడులు స్వీకరించి శబరిమలైకు మాలధారులు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరుచుకోవాలని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరు స్మార్ట్ సిటీ, స్మార్ట్ ఫార్మర్స్, స్మార్ట్ ప్రొఫెషనల్స్, టౌన్ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఈ ఏడాది జూలై నుంచి నిర్వహిస్తోన్న మధ్యాహ్నం అన్నదానానికి రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజ్ సీఎస్ఈ ఏఐఎంఎల్ విభాగ విద్యార్థులు 10 రోజుల పాటు స్పాన్సర్ చేయటానికి ముందుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ శ్రీధర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రిలోని ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రంలో 300 మందికి ఆహారంతో పాటు వాటర్ బాటిల్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, 20వ డివిజన్ ఇన్‌చార్జి జీహెచ్‌డీ ప్రసాద్, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ బి.శారద, అసోసియేట్ ప్రొఫెసర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

భీమడోలు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వాటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. పోలసానిపల్లి, అంబర్‌పేట గ్రామ పంచాయతీ వద్ద సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. తొలుత ప్రతిజ్ఞ చేయించారు. పోలసానిపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మూడేళ్లు నిండి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులకు పుస్తకాలను ఎంపీటీసీ దేవి నాగేంద్ర ప్రసాద్ అందజేసారు. ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణకుమారి, వైద్యురాలు కె.శ్రీలక్ష్మి, గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్,నాయకులు చెరుకూరి మధు, కోట దుర్గారావు పాల్గొన్నారు.

ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ


గుండుగొలనులో పూజలందుకుంటున్న భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి


గుండుగొలనులో శివాలయంలో జ్యోతిర్లింగార్చన

భీమడోలు: శివునికి ప్రీతికరమైన రోజైన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. జ్వాలా తోరణం వేడుక ఘనంగా నిర్వహించారు. అశేషంగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామాలు సోమవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆలయాల్లో స్వామి వార్లను భక్తులు విశేషంగా అలకరించారు. సోమవారం రాత్రి ఆలయాల్లో జ్వాలా తోరణాన్ని వెలిగించారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, పోలసానిపల్లిల్లోని శివాలయాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించి శివలింగాకృతిని తీర్చిదిద్దారు. భీమడోలులో పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆలయ పూజారి కాళ్లకూరి ఉమాశంకర్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు, మాలధారులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున దీపోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన, స్ఫటిక లింగ దర్శనం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో పంచామృత నవరస ఫలాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని విశేషంగా దర్శించుకుని పూజలు చేసారు.

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

పెదవేగి : కార్తీకమాసం, సోమవారం, పౌర్ణమి కావడంతో శైవ క్షేత్రాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. పెదవేగిలోని పార్వతీ పరమేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

చురుగ్గా సీసీ రహదారి నిర్మాణం


కూచింపూడిలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

పెదవేగి : కూచింపూడి గ్రామ ప్రజల దశాబ్దాల కలను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నెరవేర్చారు. దశాబ్దాల కాలంగా గ్రామం మధ్యలో ఉన్న ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోక దుర్భరంగా మారి రోడ్డంతా శిథిలమైంది. గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న రహదారి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి రహదారి అభివృద్ధికి సుమారు కోటిన్నర నిధులు మంజూరు చేయించి కూచింపూడి గ్రామం పొడవునా సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్న సీసీ రోడ్డును చూసి గ్రామస్తులు ఉప్పొంగిపోతున్నారు. గతంలో చినుకు పడితే రోడ్డంతా చిత్తడిగా మారేదని, ప్రస్తుతం సుందరంగా రోడ్డును తీర్చి దిద్దుతున్నారని గ్రామస్తులు అన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు, వాహన చోదకులు అబ్బయ్యచౌదరికి అభినందనలు తెలుపుతున్నారు.